యురేకా!

ఆనందపు కేక బయటకు రావాలని ఉబలాటపడింది. అణచి పెట్టాడు - ఆనందయ్య.

తన జీవితానికే సంబంధించిన చక్కటి సత్యాన్ని కనుక్కున్నాడు- ఆనందయ్య.

నలభై సంవత్సరాలుగా రోజుకు పదహారు, పద్దెనిమిది గంటల శ్రమకు అలవాటు పడ్డ తన శరీరం యిప్పుడు రోజుకు ఇరవైనాలుగు గంటల నిర్విరామ విశ్రాంతికి తట్టుకోలేక పోతున్నది.


అంతే- రోగ నిదానం జరిగిపోయింది. నివారణ చర్యలు చేపట్టాలి. యురేకా! ఆనందంతో పొంగి పోకపోయినా క్షుభిత హృదయం కొంత చల్లబడింది - ఆనందయ్యకు.

★ ★ ★

అప్పటికి ఐదారు నెలలుగా క్షుభితమై ఉంది- ఆనందయ్య హృదయం. ఏదో పోగొట్టుకున్నానన్న ఉలికిపాటు. మరేదో నష్టపోయానన్న వేదన. మరింకేదో అదీ యిదీ అని చెప్పరాని ఆందోళన. చెప్పలేని బాధ. అన్నం తింటే అందులో రుచి తెలియటంలేదు. కమ్మగా యింత టిఫిను చేస్తే యిది వరకెంతో హాయిగా ఉండేది. ఇప్పుడేదో మొక్కుబడి! నిద్రపోయి లేస్తే అలసట తీరినట్ల నిపించటం లేదు. ఇక సుఖమెరుగని నిద్రంటారా- అదసలు తన చాయలకే వస్తున్నట్లు లేదు. ఇది వరలో సినిమాకెళ్తే ఎంత రిలీఫ్‌గా ఉండేదో- అదెంతటి చెత్త సినిమా అయినా. ఇప్పుడదీ లేదు. సినిమా చూస్తున్నంత సేపూ ఏదో పరాజయ భావన. పోగొట్టుకున్నానన్న వేదన. తానెందుకిట్లా అయిపోతున్నాడో తెలియ రావటం లేదు - ఆనందయ్యకు గత ఐదారు నెలలుగా.

★ ★ ★

నిజానికిప్పుడు కొత్తగా ఆనందయ్య కష్టపడుతున్నదీ లేదు; నష్టపోతున్నదీ లేదు. వాస్తవానికి ఆయన స్థాయిలో ఆయనంతటి విజయులు మరొకరుండరేమో? చెయ్యటాని కాయన చేసింది - మేష్టరుద్యోగమే. అయితేనేం - తన తమ్ముళ్లిద్దరికీ ఆయన వరుసపెట్టి హైస్కూలు చదువులు చెప్పించాడు. ఒక తమ్ముడికైతే ప్రొఫెషనలు కోర్సే చెప్పించాడు. తనదీ పెద్ద సంసారమే. తన పిల్లలందరికీ కూడా ఆయన - ఆడా మగా తేడా చూపించకుండా- వాళ్లకే కోర్సుల్లో సీట్లు వస్తే ఆ చదువులు చెప్పించాడు. పిల్లలంతా చిన్నా పెద్దా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అందరికీ పెళ్లిళ్లు, పేరంటాలు అయిన్నై. ఎవరి మానాన వారు హాయిగానే బతుకుతున్నారు. కాకపోతే కన్న సంతానంలో కొందరి తీరుతెన్నులు ఆనందయ్యకు నచ్చవు. తమ అలవాట్లతో తాము నష్టపోతూ, తమ వారిని వాళ్లు కష్టపెడుతున్నారని బాధపడ్డాడు. అట్లా అని ఆయన వాళ్లతో తగాదాకు దిగడు. కుళ్లు గుమ్మడికాయలా తాను కుళ్లిపోవటమే!



ఇప్పుడీ ఐదారు నెలలుగా తాననుభవిస్తున్న చిత్తక్షోభకు కారణం - తన సంతానమా? కాదనుకుంటాడు ఆనందయ్య. వాళ్లల్లో ఒకరొకరిగా లోటు పాట్లూ.. వికారాలు ఇప్పుడేమిటీ - గత పది, పదిహేనేళ్లుగా తనను బాధిస్తూనే ఉన్నాయి. ఈ ఐదారు నెలల్లో వాళ్లను కొత్తగా పట్టుకున్న పీడ లేవీ లేవు. అదీగాక తాను గట్టిగా చెప్పడు గానీ - చెప్తే, తమ అవసరాలను పిల్లలు తండ్రి దృష్టికి రాకుండానన్నా జాగ్రత్త పడతారు. చాటుమాటు వ్యవహారమన్నా సాగిస్తారు. కాని తానలా చెప్పడు. తనకు పిల్లలను అదుపాజ్ఞలలో పెట్టటం తెలియదనో.... తరాల అంతరాలనో... తాను మరీ సెంటిమెంటల్‌గా ఉంటాననో... ఇట్లా పిల్లల తీరు తెన్నుల వల్ల కలిగే ఆందోళన నుండి తనకు తానే ఓదార్పులు చెప్పుకుంటాడు ఆనందయ్య.

మరైతే గత ఐదారు నెలలుగా తన మనసు అనుభవిస్తున్న క్షోభకు కారణమేమై ఉంటుంది?

ఆనందయ్య మొదటి నుంచి ఒక రాజకీయ పార్టీ అభిమాని. ఆ పార్టీ ఈ మధ్య అధికారంలోకి వచ్చినట్లే వచ్చి, దిగిపోయింది. ఆ రాజకీయమంతా ఆనందయ్య మనసును అతలాకుతలం చేసిన మాట నిజమే. అయితే, యిదంతా జరిగింది ఈ మధ్యనే కదా! తననీ నిర్వేదం అంతకు ముందు నుంచే పట్టి పీడిస్తున్నది. కాకపోయినా రాజకీయాలు తన ఇచ్ఛానుసారం ఎందుకు నడుస్తాయి? నడువవన్న వివేకం ఆనందయ్యకున్నది. కాబట్టి అదీ తన చిత్తక్షోభకు కారణమై ఉండదు.

పోనీ, ఆర్థిక యిబ్బందులా? ఆయన కసలు యిప్పుడులేని యిబ్బందులే అవి! సరిగ్గా ఇరవై నెలల కిందట ఆనందయ్య చేస్తున్న మేష్టరు ఉద్యోగం నుంచి రిటైరైనాడు. అంతకు ముందంతా ఆయనలో ఒక పెద్ద దిగులు ఉండేది. తాను సజావుగా రిటైరై... రిటైరుమెంటు బెనిఫిట్లు అన్నీ అందుకోగలడా? అట్లా కాక తనకేదన్నా జరిగి, పిల్లలకు అప్పులు మిగిల్చి పోతాడా?


అప్పులు! అప్పులు! ఆనందయ్య బతుకంతా ఒకరకంగా అప్పులతోనే గడిచినదని చెప్పవచ్చు. చెప్పటానికాయన దిట్టంగానే ప్రైవేట్లు చెప్పేవాడు. ఎవరినీ ఫీజులకని ఒత్తిడులు పెట్టకుండా, ఉదాత్తంగా చెప్పినా- ఆయన సంపాదన తక్కువగా ఏమీ ఉండేది కాదు. అడిగించుకోకుండానే ఆయన దగ్గర చదువుకునే విద్యార్థినీ విద్యార్థు లాయనకు చక్కగా ఫీజులూ అవీ ఇచ్చేవారు. 'రెండు చేతులా సంపాదన' అన్నట్లుగానే ఉండేది. కాకపోతే, పోస్టుబ్యాగు నింపటం! బండెడు ఉత్తరాలు సార్టు చేస్తే తలా రెండు మూడే కదా- వచ్చేది! అట్లాగే ఉండేది ఆయన సంపాదన. అటు తమ్ముళ్ల చదువులు-ఇటు తన పిల్లల చదువు సంధ్యలు.. వీటన్నింటితో ఆయన బతుకంతా అప్పులుగానే ఉండేది. రిటైరయ్యే నాటికి ఆయనకు మిగిలింది కూడా అప్పే! పెన్షను, గ్రాట్యుయిటీలకు సగానికి సరిపడా అప్పులే మిగిలినై!


తనకేదన్నా అకస్మాత్తుగా జరిగితే? ఈ అప్పులన్నీ పిల్లలకు మిగిల్చి పోయినవాడిని అవుతానేమోనన్న అజ్ఞానపు భయం ఆయనను బాగానే వేధిస్తూ ఉండేది- కొంత కాలం కిందట.

నిజానికాయన దగ్గర స్కూలువారు 80 రూపాయల జనరలు ఇన్సూరెన్సు ప్రీమియం కట్టించుకోవాలి. కాని జి.వో. లేదో రాలేదని స్కూలు వారాయనదగ్గర 40 రూపాయలే కట్టించుకునేవారు. అంటే తనకేదన్నా జరిగితే... 40 వేలే వస్తాయన్నమాట. 80 కట్టించుకుంటే ఎనభైవేలు వస్తాయి. తన అప్పులకు నలభై ఏమూలకొస్తాయి? 'ఎనభై కట్టించుకోండి బాబూ' అని స్కూలువారి నెప్పుడూ ఆయన బతిమిలాడుతూనే ఉండేవాడు. మిగతా మేష్టర్లకు ఆయన భయం అర్థం కాదుగదా! వరాఆయనను ఎగతాళి చేసేవారు కూడా. నెలకో ఎనభై కోత ఎందుకనేది వాళ్ల వాదన. ఆనందయ్య ఆందోళన ఆనంద

## యురేకా

ఆర్.యస్.కె. మూర్తి






య్యేది. ఆయనకామధ్య గుండెపోటు కూడా వచ్చింది. రెండోసారి వస్తే... ప్రాణాపాయమేనట! రిటైరు కాకముందే తనకది రెండోసారి వచ్చేస్తుంది?

ఈ క్షోభకూడ ఇప్పుడాయనకు లేదు. మళ్లీ గుండెపోటు రాకుండానే, ఆనందయ్య రిటైరైపోతాడు. రావల్సిన సొమ్ములన్నీ వచ్చేసినై. అప్పులన్నీ అర్థణా మిగలకుండా తీర్చివేశాడాయన. మిగిలినదేదో బ్యాంకులో వేసుకొని, పెన్షనుతో హాయిగా గడిపేస్తున్నాడు. ఎంత రిలీఫుగా ఉంటున్నదో-ఆనందయ్య అప్పుల బ్రతుకుకు.

★ ★ ★

అప్పులు చేయటానికి అవమానం! చేసిన తర్వాత భారం! అబ్బ, ఎంతగా మెలికలు తిరిగిపోతూ ఉండేదో ఆనందయ్య హృదయం!

ఆనందయ్య బి.ఏ. కాంగానే ఒక కాలేజీలో ట్యూటరుగా ఉద్యోగం చేశాడో సంవత్సరంపాటు. అప్పుడో సహోద్యోగి ఆయనకు చిరు అప్పులు పెట్టేవాడు. రెండు లేక మూడు రూపాయలు! వాటికోసం మైలు మైలున్నర నడిచి వాళ్లింటికి వెళ్లేవాడు-ఆనందయ్య. అప్పట్లో శేరు బియ్యం అర్థరూపాయి, పదాణాలు రోజులు. రెండు మూడు రూపాయలంటే పెద్ద అప్పు కిందనే లెక్క. ఆ గుప్తాగారంతా తనకు చిల్లర ఇచ్చేవాడు. ఫస్టున జీతం వచ్చినప్పుడు పెళపెళలాడే రెండు రూపాయల నోట్లు తిరిగి ఇవ్వవలసి వచ్చేది. అదంతా ఎంతటి హింసాత్మకంగా ఉండేదో?

ఇంకోసారి... కొడుకుని అర్జంటుగా తీసుకెళ్లి ఇంజనీరింగులో చేర్పించాలి. వెయిటింగులిస్టులో సీటు వచ్చింది. ఇంకో రెండు వందలన్నా ఉంటే, బాగుంటుంది. ఆ రెండు వందల అప్పుకోసం ఆరోజున ఆనందయ్య పడ్డ బాధ! హా! ఇప్పటికీ ఆయనకది తేలుకుట్టే! మిత్రులొకరిని అడిగితే, ఆయన తెచ్చి ఇచ్చాడు - గంటలో!కాని, తర్వాత తెలిసింది ఆ మిత్రుడి భార్య నగ బాంకులో పెట్టి ఆ రెండువందలు తనకు తెచ్చి ఇచ్చాడట! అబ్బా! ఇప్పటికీ గుర్తుకొస్తే - ఎంతటి గాయం రేగుతుందో?

ఇట్లా అప్పుల బతుకు గడిపిన ఆనందయ్యకు ఇప్పుడెంతో హాయిగా ఉంటున్నది. తన పిల్లలు తననుండి పైసా ఆశించరు. పైపెచ్చు అమ్మ నాన్నలకు అదీ ఇదీ పెట్టాలనే ప్రేమ కలవారే అందరూ. కొంతమంది రిటైరైన తర్వాత కూడా చిన్నా చితకా ఉద్యోగాలు చేస్తుంటారు. వాళ్లంటే చిరాకు- ఆనందయ్యకు. తనకా అవసరం లేకుండా చేసిన భగవానునికి సదా కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉంటాడాయన.

★ ★ ★

తాను మటుకు మళ్లీ ఉద్యోగాల జోలికి పోడు. హాయిగా తనకు తోచిన పని చేసుకుంటూ శేష జీవితం గడిపేస్తాడు.

అట్లాగే గడుపుతున్నాడీ ఇరవై నెలలుగా. ఉద్యోగంలో ఉండగానే, ఆనందయ్య రెండు మూడు అదనపు వ్యాపకాలు అలవాటు చేసుకున్నాడు. స్కూలు, ట్యూషన్లు ఇవన్నీ చూచుకుంటూనే ఆయన కథలు వ్రాయటం అలవాటు చేసుకున్నాడు. సాహిత్య సభల్లో, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనే వాడు. కథారచయితగా ఆనందయ్యకు మంచిపేరే వచ్చింది. ముప్పయి సంవత్సరాల తర్వాత కలం పట్టినా, ఆయన కలం చురుకుగానే నడిచేది. అంతా ఆరేడు సంవత్సరాల వ్యవధిలోనే ఆయన కథలు అరవై, డెబ్బయి దాకా వివిధ పత్రికల్లో వచ్చినై. తమ దైన ఒక జీవన దృక్పథంతో ఆనందయ్యగారు కథలు రాస్తారని... తెలిసిన వారందరూ ఆయన కథలను మెచ్చుకునే వారు కూడా. వ్యక్తి జీవితంలో డీసెన్సీ, కుటుంబ జీవితంలో అనురాగం, సామాజిక జీవితంలో త్యాగ, ధర్మ నిరతి పెంచటానికై ఆనందయ్యగారు కథలు రాస్తారని అందరూ అంటుండేవారు. ఇట్లాంటి మంచి మాట లెంతగానో ఆనంద పరుస్తూ ఉండేవి-ఆనందయ్యను. 'కథన' రంగంలోనే ఆయన కొనసాగి ఉంటే మరెన్నో గొప్ప కథలను ఆయన రాసి ఉండేవాడని కూడా వారు అంటుంటారు.

ఆనందయ్య దృష్టి అటు తర్వాత జర్నలిజం వైపుకు మళ్లింది. పత్రికలతో పరిచయాలు ఏర్పడినై. రాజకీయ వ్యాసాలు... కొన్ని పత్రికలకు ఘోస్టు సంపాదకీయాలు, సినిమా సమీక్షలు, పుస్తక సమీక్షలు కూడా ఆయన వ్రాయటం మొదలు పెట్టాడు. జర్నలిస్టుగా కూడా ఆయనకంతో ఇంతో పేరు వచ్చింది. కాకపోతే కథారచన కుంటుపడి పోయింది. తన సృజనాత్మక శక్తి కొర్రబడి పోతున్నదా? ఆమధ్య కొంత కాలం ఆయన బాధ పడ్డాడు కూడా. "రాజకీయాది వ్యాసాలదేముంది మేస్టారూ, అవెవరైనా రాయగలరు. మీరు కథలే రాయండి బాబూ" అని చనువుగా ఆయనను మందలించిన వారు కూడా లేకపోలేదు. ఇదొక మనోవేదనగా ఉండేది- ఆమధ్య కొంతకాలం ఆనందయ్య బతుకులో.

ఇదిగో, ఇప్పుడే రిటైరుమెంటుతో అదీ తొలగిపోయింది. హాయిగా... రోజుకు ఇరవైనాలుగు గంటల ఖాళీ! ఎన్ని వ్యాసాలైనా రాసుకోవచ్చు. ఎన్ని కథలైనా అల్లుకోవచ్చు!

ఆపనే చేస్తున్నాడు ఆనందయ్య ఈ ఇరవై నెలలుగా. ఒకపక్క పత్రికలకు వ్యాసాలు వగైరాలు రాస్తూనే మళ్లీ కథారచనకు ఉపక్రమించాడు. ఈ ఇరవై నెలల్లో అప్పుడే ఏడెనిమిది కథలు వివిధ పత్రికల్లో వచ్చినై కూడా. కథకులుగా ఆయనను బాగా ప్రోత్సహించే ప్రముఖ కథకులొకరు ఈమధ్య కనిపించి "మీ కలం ముసలిదైపోలేదు మేస్టారూ" అని ఆయన తాజా కథలను మెచ్చుకున్నారు కూడా.

★ ★ ★

వాస్తవానికివన్నీ ఆనందయ్యకీమధ్య అమితానందాన్ని కలిగించిన మార్పులే. ఉద్యోగ జీవితంకంటే రిటైరుమెంటు జీవితమే దర్జాగా ఉన్నదన్న భావన ఆయనకీమధ్య కొంతకాలం ఉయ్యాలలూగించిందికూడా. ఆర్థిక ఇబ్బందులు లేకపోవటం... అప్పుల హింస నుంచి విముక్తి లభించటం... రాసినన్ని కథలూ, వ్యాసాలూ రాసుకోగలగటం... ఇవన్నీ ఆనందయ్యకు చల్లటి గంధపు పూతలే అవుతూన్నాయి ఈమధ్య "నిర్మమో, నిరహంకారో" అన్నాడుకదా-గీతాచార్యుడు. పిల్లల మీది దుర్వ్యామోహాన్ని కొంత తగ్గించుకుంటే... వారి అవసరాల గురించి తాను నిరాసక్తంగా ఉండగలిగితే... ఇక తనకంతా సుఖజీవనమే- అన్న ధైర్యం కూడా కలుగు

తున్నదీమధ్య ఆనందయ్యకు. "అనాయాస మరణం" ఒక్కటే ఇక తాను ఈ జీవితంలో పొందగల సౌభాగ్యమన్న ధీమా ఒకటి ఏర్పడుతున్నదీమధ్య - ఆనందయ్యలో.

★ ★ ★

అటువంటి ఆనందయ్యకు ఐదారు నెలలుగా అదోరకమైన చిత్తక్షోభ ఏర్పడింది. అంతా బాగానే ఉంది కాని తానేదో పోగొట్టుకున్నాడు. ఏదో నష్టపోయాడు. తన మనసెందుకో క్షోభ పడిపోతున్నది. తను వెందుకో క్షీణించి పోతున్నది. తిండి బలాన్ని ఇవ్వటం లేదు. నిద్ర సుఖాన్ని ఇవ్వటం లేదు. చిత్తం దేవునిమీద నిలవదు, భక్తి చెప్పులమీదా లేదు- అన్నట్లుగా ఉంది ఆయనపని!

రచనా వ్యాసంగం - అదీ చప్పగానే ఉంటున్నదీ ఐదారు నెలలుగా. ఇదివరలో ఆనందయ్య రాసిన కథ చాలా అరుదుగా పత్రికల నుండి తిరగొచ్చేది. ఇప్పుడైతే ఒక కథ ప్రచురించబడితే, నాలుగు కథలు తిరిగి వస్తున్నాయి. ఇదివరలో తనను అడిగి వ్యాసాలు రాయించుకున్న పత్రికలవారికి కూడా ఇప్పుడు తానై రాసి పంపుతున్నవి అంతగా నచ్చుతున్నట్లు లేదు. నెలకో కథ రాయటం కృత్యదావస్థ అవుతున్నది. క్షణానికో కథా వస్తువు స్ఫురిస్తున్నది. కాగితం మీద కలం మటుకు నడవదు. అదో చిత్రహింస.

ఆ కొడుకు దగ్గరా, ఈ కూతురు దగ్గరా వాళ్ల వాళ్ల అవసరాలను బట్టి ఉండటం. అందరూ బాగానే చూచుకుంటారు. అయినా, ఏదో వెలితి! ఇంకా ఏదో కావాలని తపన! అది అందటంలేదని అసంతృప్తి!

ఏమిటైంది తన రిటైరుమెంటు బతుకుకు!

★ ★ ★

యురేకా!

తన బతుకుకేమైందో చటుక్కున తట్టింది - ఆనందయ్యకు. తాను పోగొట్టుకున్నదేమిటో తెలిసిపోయిందాయనకు. నష్టపోయినదేమిటో అర్థమైపోయినదాయనకు!

ఆరోజు రాత్రి పదకొండు గంటలకే నిద్ర పట్టేసింది - ఆనందయ్యకు. మళ్లీ మెలకువ వచ్చేసరికి మూడు గంటలైంది. ఇన్ని గంటలు ఒకే బిగువున నిద్రపోవటం ఈ మధ్య అందని అనుభవం ఆనందయ్యకు. గంటకోసారి మెలకువ రావటం.... బయటకని వెళ్లిరావటం... మళ్లీ ఏ గంటకో నిద్ర పట్టటం! అటువంటిదా రాత్రి ఒకే బిగిన నాల్గు గంటలు నిద్రపోవటం - ఆనందయ్యకే ఆశ్చర్యమైంది.

అదీ... రాత్రి తనకు నిద్రపట్టే సమయానికి ఇంట్లో వారింకా టి.వి. కట్టేయలేదు. బాలచందర్ సినిమా ఏదో వస్తున్నదని వారంతా గుడ్లు పెట్టుకొని టి.వి. చూస్తూనే ఉన్నారు. పాటలూ, మాటలూ ఆస్వాదిస్తూనే ఉన్నారు. ఆనందయ్య కళ్లే నిద్రలో తూగిపోయినై. ఒళ్లు నిద్రలో ఒదిగిపోయింది. మెలకువ వచ్చేసరికి చూస్తే మూడు గంటలైంది!

అబ్బ, తాను నాలుగు గంటలు ఏకబిగిన నిద్రపోయాడా? ఈమధ్య కాలంలో ఎన్నడూ లేనిదింతకాలం ఎట్లా నిద్రపోగలిగాడు?

ఆత్మ విమర్శ చేసుకున్నాడు - ఆనందయ్య.

ఆరోజున తాను రోజువారీకి అదనంగా చేసినదేమిటి?

చెయ్యకపోవటమేం? అదేదో సంస్థవారు నగరంలో పదవతరగతి చదువుతున్న వారిలో ఫస్టుక్లాసు వచ్చే వారందరికి అదనపు కోచింగు ఇస్తున్నారుట. ఆ క్లాసుకొచ్చి రెండు గంటలు ఇంగ్లీషు గ్రామరు చెప్పమన్నారు ఆనందయ్యను. ఆరోజు ఆయన వెళ్లి అట్లా రెండు గంటలూ చక్కగా గ్రామరు పాఠం చెప్పి వచ్చాడు. అటు తర్వాత కూడా ఏదో సాహిత్య సభ ఉంటే, దానికి హాజరై అందులో ప్రసంగించి వచ్చాడు - ఆనందయ్య.

అంటే రిటైరు మెంటు జీవితంలో ఒక రోజును ఉద్యోగ జీవితంలో ఒక రోజులాగా - కాకపోతే అప్పటి ఒత్తిడులు లేకుండా - గడిపాడన్నమాట!

యురేకా!

అదీ రహస్యం! తన శరీరం అధిక విశ్రాంతిని తట్టుకోలేక పోతున్నది. రోజుకు ఇరవైనాలుగు గంటలు తన మనసు ఆలోచనలను అదే పనిగా పొంగించలేక పోతున్నది. శరీరానికి శ్రమ లేకపోయినా, మనసు డస్సిపోతున్నది. సమతుల్యం దెబ్బతిన్నది. మన, తను కార్యక్రమాల మధ్య.

అందుకే అన్నం పిండి ఫలహారమవుతున్నది. నిద్ర విశ్రాంతికి ప్రత్యామ్నాయం కాలేకపోతున్నది.

విశ్రాంతికి ప్రత్యామ్నాయంగా శరీరాని కేదన్నావని ఉండాలి. మనసుకేదన్నా వ్యాయామముండాలి.

పని! తానేదో పని పట్టుకోవాలి!

తానిప్పుడు రోజంతా ఏదోపని చేస్తూనే ఉన్నాడు. అది పెట్టుకున్న పని కాదు, తోచిన పని. ఆ పని చెయ్యకపోయినా ఫర్వాలేదన్న దిలాసాతో చేస్తున్నాడు. బాధ్యతారాహితంగా శ్రమ పడుతున్నాడు.

నలభై సంవత్సరాలపాటు.. రోజుకు పదహారు, పద్దెనిమిది గంటల బాధ్యతాయుతమైన పనికి అలవాటు పడ్డాయి తన మనస్సు, తన శరీరం.

ఇప్పుడు రోజుకు ఇరవైనాలుగు గంటలు నిర్వ్యాపారంగా ఉండటం వాటికి చేతకావటం లేదు. నిర్విరామ విశ్రాంతి వాటిని ఆరోగ్యంగా ఉంచటం లేదు.

యురేకా!

తన రోగమేమిటో అర్థమైంది ఆనందయ్యకు.

రోజుకిన్ని గంటలపని విధినిషేధాల అదుపులమధ్య చేయవలసిన పని- అదే తనకు మంచి మందు అనుకున్నాడు ఆనందయ్య.

తన సమస్యకు తానే పరిష్కారం కనుక్కున్న ఆనందం తన్నుకొచ్చింది - ఆనందయ్యలో అణచిపెట్టుకొని, చికిత్స మొదలుపెట్టుకున్నాడు ఆనందయ్య.

"ఆనందయ్య కోచింగు సెంటరు
ఇక్కడ అన్ని తరగతులవారికి
ఉచితంగా ఇంగ్లీషు బోధించడబును"
బోర్డు వెలిసింది ఆనందయ్య ఇంటిముందు!
ఆనందనిలయం ముందు.

